క్లుప్తంగా

రేపటి నుంచి క్రీడా పోటీలు

టేకుమట్ల: మండల లెవల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14, అండర్–17 విభాగాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలకు మండల స్థాయి జట్ల ఎంపిక ఈ నెల 26, 27, 28 తేదీల్లో నిర్వహించనున్నట్లు మండల ఎస్‌జీఎఫ్ క్రీడల చైర్ పర్సన్ కొడెపాక రఘుపతి తెలిపారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలోని బాలబాలికలు ఈ పోటీలలో పాల్గొనాలని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఫిఫ్త్ ఫేస్ వాక్ ఇన్ అడ్మిషన్ ద్వారా ప్రవేశం కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భిక్షపతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్‌సీవీటీ ప్యాట్రన్ కింద కోపా, సివిల్ డ్రాఫ్ట్‌స్‌మెన్ విభాగాల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. కోపా 15, సివిల్ డ్రాఫ్ట్‌స్‌మెన్ విభాగంలో 24 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరామర్శ



మొగుళ్లపల్లి: మండలంలోని పాత ఇస్సిపేట గ్రామానికి చెందిన జన్నె రాజు కూతురు జన్నె సాయిశ్రీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బల్గూరి తిరుపతిరావు, నాయకులు కోడారి రమేశ్, వెంకట్‌రావు, శ్రీనివాస్, కమలాకర్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ



రేగొండ: రేగొండ మండల ప్రత్యేక అధికారిగా భూపాలపల్లి ముఖ్య ప్రణాళిక అధికారి బాబురావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ మండల ప్రత్యేక అధికారిగా పని చేసిన శామ్యూల్ పదోన్నతిపై భువనగిరి వెళ్లారు.

వాహనాల తనిఖీ



రేగొండ: మండల కేంద్రంతో పాటు, మండలంలోని వివిధ గ్రామాల కూడలిలో ఎస్సై సందీప్‌కుమార్ మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ముందు జాగ్రత్తలో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా తనిఖీలను ముమ్మరం చేశారు. వాహనాల్లో ప్రయాణించే వారి వివరాలను సేకరించారు.

సహజవనరులు లూటీ



టేకుమట్ల: టేకుమట్ల, చిట్యాల రెండు మండలాల్లో సహజ వనరులను లూటీ అవుతున్నాయని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు మండలాల్లో టేకులబోడు, కంపబోడు, జొన్నల రాశి బోడుతో పాటు వందలాది ప్రభుత్వ భూమి కలిగి ఉందని అన్నారు. గతంలో మైనింగ్ పేరిట అక్రమంగా అక్రమించుకుని గత ప్రభుత్వంలో ధరణి పేరిట నమోదు చేసుకుని కోట్లాది రూపాయాల మట్టిని దోసుకపోయారని వాపోయారు. తక్షణమే సర్వే చేపట్టి గుట్టలను కాపాడాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే ఓ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట వందలాది ఎకరాలు ఆక్రమించుకుని రూ.కోట్లాది విలువ చేసే ఎర్ర మట్టిని తరలిస్తున్నారని మండిపడ్డారు. ఇంత జరుగుతున్న సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రెండు మండలాలలో ఆక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతున్న పట్టించుకునే నాథుడే కరువయ్యారని అన్నారు. ఆయన వెంట నాయకులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం



పలిమెల: అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శివరాణి

పలిమెల: గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలు తమ రోజువారీ ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివరాణి సూచించారు. మంగళవారం మండలంలోని పంకెన గ్రామంలో సూపర్‌వైజర్ శివరాణి ఆధ్వర్యంలో పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పిల్లలు వయస్సుకు తగిన బరువు, ఎత్తు లేకపోవడంతో వారిలో ఇమ్యూనిటీ పవర్ తగ్గుతుందని సూచించారు. పిల్లల ఆరోగ్య స్థితిని పరిశీలించి తల్లులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ ఎంపీహెచ్ఎస్ (ఎఫ్) లక్ష్మి, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి

చిట్యాల: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సమతులమైన ఆహారం తీసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జయప్రద అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంగన్‌వాడీ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతంగా ఉండాలని కోరారు. 11 నుంచి 18 సంవత్సరాల బాల బాలికలకు ఈ దశ చాలా కీలకమైందని అన్నారు. కావున విద్యార్థులు సమతుల ఆహారంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కర్ణాకర్, అంగన్‌వాడీ టీచర్లు సంధ్యారాణి, భాగ్యలక్ష్మి, జ్యోతి, అరుణ, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి రూరల్: బాలుడి బరువు చూస్తున్న వైద్యురాలు

భూపాలపల్లి రూరల్: గర్భిణులు, బాలింతలు, పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే పోషకాహారాన్ని తీసుకోవాలని మోరంచపల్లి ప్రభుత్వ వైద్యురాలు శారద సూచించారు. పోషణ మాస ఉత్సవాల సందర్భంగా మంగళవారం భూపాలపల్లి మండలంలోని మోరంచపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ శారద ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులు బాలింతలు తగిన పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. అలాగే పుట్టిన బిడ్డ నుంచి ఐదు సంవత్సరాల పిల్లల వరకు ప్రతీ నెల బరువు ఎత్తులు చూయించుకోవాలని తల్లులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం సరోజా, అంగన్‌వాడీ టీచర్లు మధుర, హైమ, ఆశ కార్యకర్తలు రమ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

గణపురం: మండలంలోని ధర్మరావుపేట గ్రామంలో మంగళవారం గండ్ర సమ్మారావు(జీఎస్సార్)ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలు ఆరోగ్య స్థితిగతులపై జాగ్రత్త వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలోని ప్రజల కోసం ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలు చేసుకున్నారు. ఈ శిబిరంలో సుమారు 300 మంది వరకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించుకున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న రైస్ మిల్లర్స్

భూపాలపల్లి రూరల్: జిల్లా బాయిల్డ్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంగల వినయ్ కుమార్ ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు మంగళవారం హనుమకొండలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసే సన్న ధాన్యం 14 శాతం తేమతో పాటు ఎఫ్ఏఓ నాణ్యత ప్రమాణాలు ఉండే విధంగా సేకరించాలని కోరారు. అదే విధంగా మిల్లర్లకు రావల్సిన పెండింగ్ బకాయిలను త్వరిత గతిన విడుదల చేయించాలని విజ్ఞప్తి చేశారు. కాగా, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు మిల్లర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ నడిపెల్లి ప్రశాంత్ రావు, ట్రెజరర్ కల్లూరి కృష్ణమూర్తి, వైస్ ప్రెసిడెంట్ పెండెం రేపాల్, సభ్యులు నర్సింగరావు, శ్రీనివాస్ రావు, రవీందర్, కార్తీక్, రాజు ఉన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



గణపురం: వరిపంటను పరిశీలిస్తున్న అధికారులు



దుబ్బపేటలో పొలాలను పరిశీలిస్తున్న ఏఈఓ

గణపురం: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటల పరిరక్షణ చర్యలు తీసుకుంటూ రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యవసాయాధికారి విజయ భాస్కర్ అన్నారు. పంటలను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పత్తి చేనులో నీరు ఉంటే మొక్కలు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. నీరు నిల్వ ఉండకుండా కాల్వలు తీసి నీటిని బయటకు పంపాలన్నారు. పంట రక్షణ విషయంలో సలహాలు, సూచనల కోసం రైతులు వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు రమేష్, మండల వ్యవసాయాధికారి డి.అయిలయ్య, మండల విస్తరణ అధికారులు మౌనిక, కల్యాణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మల్హర్‌లో..

మల్హర్: మండలంలోని దుబ్బపేట, వల్లెకుంట గ్రామాల్లో వరి పంటను ఏఈఓలు శిరీష, అనూష మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాల్లో కాండం కుళ్లు తెగులు లక్షణాలు గుర్తించినట్లు ఏఈఓలు తెలిపారు. ఈ లక్షణాలతో నీటి మట్టానికి ఆనుకున్న నల్లని చారలతో కూడిన మచ్చలు ఏర్పడతాయని, దుబ్బులోని పిలకలు వాడిపోవడం లేదా కింది వరస ఆకులు పసుపు రంగు మారి కుళ్లి పిలకలు చనిపోతాయని వారు పేర్కొన్నారు. ఎండిన పిలకలు చీల్చి చూసినప్పుడు లోపలి భాగంలో సన్నని ఆవాల గింజ రూపంలో సిద్ధ బీజాలు(స్లీరోషియాలు) కనిపిస్తాయని తెలిపారు. వీటి నివారణకు హైక్సాకొనజోల్ 2.0 మిల్లీ లీటర్ లేదా వాలిడా మైసిన్ 2.0 మిల్లీ లీటర్ లేదా ప్రాపికొనజోల్ 1.0 మిల్లీలీటర్లు లేదా టెబుకొజోనల్ 1.0 మిల్లీ లీటర్ల నీటిని కలిపి 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిలకల కింద వరకు నడిచేలా పిచికారీ చేయాలని సూచించారు.

ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలు



మాట్లాడుతున్న రవీందర్

మల్హర్: మండలంలోని తాడిచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ (జాతీయ సేవ సమితి) ఆవిర్భావ వేడుకలను ప్రోగాం అధికారి మద్దెల రవీందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ చైర్మన్, కళాశాల ప్రిన్సిపాల్ విజయదేవి, ప్రోగాం అధికారి రవీందర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్ఎస్ఎస్‌లో చేరడం ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, సోదర భావం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని వివరించారు. ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్‌లో చేరి నవ సమాజ నిర్మాణంలో పాలుపంచుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు నరేందర్, ప్రవీణ్, వెంకట్‌రెడ్డి, కరుణాకర్, భరత్‌రెడ్డి, నరేష్, రవి, జైపాల్, ఉమామహేశ్వరి, సిబ్బంది రాములు, షబ్బీర్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజీమార్గమే రాజమార్గం

టేకుమట్ల/ రేగొండ: రాజీ మార్గమే రాజ మార్గమని టేకుమట్ల ఎస్సై గోగికారి ప్రసాద్ , రేగొండ ఎస్సై సందిప్ కుమార్ మంగళవారం వేర్వేరు ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని కోర్టులో నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీపడదగిన కేసులు, సివిల్, క్రిమినల్ కేసులు, బార్యభర్తల కేసులు, యాక్సిడెంట్ కేసులకు లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందన్నారు. చిన్న చిన్న కేసులో కక్షలు పెంచుకోని కోర్టు చుట్టూ తీరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవొద్దన్నారు. లోక్ అదాలత్ ద్వారా కేసులను సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోని కేసులు రాజీ చేసుకోవాలని సూచించారు.

మిర్చి పంటపై రైతులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

చిట్యాల: ఎస్ఎస్ఎస్‌పీ ద్వారా మిర్చి పంటపై రైతులకు మాస్టర్ ట్రినర్ కె.ఉపేందర్‌రెడ్డి మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐపీఎం, ఐఎన్ఎమ్ పద్ధతులతో సాగు చేసుకుంటే అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. సేంద్రీయ సాగు విధానం, పంట కోతల విధానం, అలాగే మార్కెంటింగ్ పద్ధతులపై శిక్షణ ఇచ్చి దానికి తోడుగా జీవ వైవిధ్య రక్షణ, వాతావరణ సంరక్షణ, సామాజిక బాధ్యతలు గుర్తు చేస్తు పెట్టుబడి తగ్గడానికి పలు సూచనలు చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గుమ్మడి శ్రీదేవి–సత్యం, పోతన ఎస్టీఓ చీఫ్ ఫంక్షనరీ జి.వెంకట్‌రెడ్డి, ఓరుగల్లు ఎఫ్పిఓ ఎండి, సత్యనారాయణ రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ సునీల్, ఏఈఓలు సన్నీ, రమణకుమార్, సందీప్, రైతులు సమ్మిరెడ్డి, రాంరెడ్డి, కిష్టయ్య, పింగిలి జ్యోతి పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



మాట్లాడుతున్న సీఐ మల్లేశ్



మొగుళ్లపల్లి: మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు విజయపాల్‌రెడ్డి

రేగొండ(కొత్తపల్లిగోరి): క్రీడల్లో గెలుపోటములను సహజమని చిట్యాల సీఐ మల్లేశ్ అన్నారు. మంగళవారం కొత్తపల్లిగోరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి అండర్–14, అండర్–17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు భూపాలపల్లిలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీఈటీ చిర్ర రఘుపతి తెలిపారు. అంతకుముందు కార్యాక్రమానికి వచ్చిన అధికారులకు క్రీడాకారులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వీరభద్రం, ఎస్సై సందీప్ కుమార్, ఎంఈఓ వేల్పుల ప్రభాకర్, ప్రధానోపాధ్యాయురాలు మాధవిలత, ఆర్గనైజింగ్ సెక్రెటరీ విజేతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల స్థాయి అండర్–14, అండర్–17 కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడల ఎంపిక పోటీలు మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ ప్రభాకర్ హాజరై మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు క్రమశిక్షణ, దేశభక్తి పెరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయులు విజయ్‌పాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సురేష్, సందీప్, శ్రావణి, శ్రీనివాస్, అజయ్, కార్తీక్, వేల్పుల రాజు, ఇంచర్ల రాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలని ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

మొగుళ్లపల్లి: ప్రపంచ నదుల దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యావరణాన్ని పరిరక్షించాలని మండలంలోని మొట్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎన్‌సీసీ విద్యార్థులతో గ్రామంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ అధికారి పాఠశాల, ప్రధానోపాధ్యాయులు లింగాల కుమారస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో నదుల ప్రాముఖ్యం గురించి అవగాహన కల్పించారు. అనంతరం బతుకమ్మ వాగు దగ్గర, బతుకమ్మ ఆట ఆడుకునే చోట స్వచ్ఛతాహీ కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ గాజు పెంకులు చెత్తా చెదారాన్ని తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి జంపాల సుజాత, ఉపాధ్యాయులు నరసింహస్వామి, సంపత్ కుమార్, వీరయ్య, ఉమారాణి, రవీందర్, రాణి, ఎన్ రవీందర్, శోభా రాణి, శకుంతల, సందీప్, కవిత, రవి ప్రసాద్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా కమిటీలో పలువురికి చోటు



అధ్యక్ష కార్యదర్శులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

చిట్యాల: పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా కమిటీలో మండలానికి చెందిన వివిధ పాఠశాలల ఉపాధ్యాయులకు చోటు లభించింది. నవాబుపేట ఎస్సీ కాలనీ పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు కుసునపు కిరణ్‌కుమార్‌కు జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెండవసారి పదవి బాధ్యతలు చేపట్టారు. అలాగే చల్లగరిగ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయురాలు మందల ఝాన్సీరెడ్డి అసోసియేట్ అధ్యక్షురాలిగా, జడలపేటలో పని చేస్తున్న ఫీజికల్ డైరెక్టర్ నూకల లింగయ్య జిల్లా ఉపాధ్యక్షుడిగా, నైన్‌పాక ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న జె.విజయశాంతి జిల్లా ఉపాధ్యక్షురాలిగా, జడలపేటలో పని చేస్తున్న ఎం.పావని జిల్లా కార్యదర్శిగా, చిట్యాల మోడల్ స్కూల్‌లో పని చేస్తున్న నీలం రవీందర్ జిల్లా కార్యదర్శిగా ఎంపికైయ్యారు. దీంతో పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు బండి శ్రీనివాస్, సూదం సాంబమూర్తి అభినందనలు తెలిపారు. అలాగే పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన రేగూరి సుభా కర్‌రెడ్డి, కుసునపు కిరణ్‌కుమార్‌లకు మండల శాఖ తరుపున సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

కరపత్రం ఆవిష్కరణ

మంగపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర అంబేడ్కర్ యువజన సంఘం 48వ వార్షికోత్సవ సభ కరపత్రాన్ని ఆ సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు అధ్యక్షతన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 29న హనుమకొండలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కాలేజీలో జరిగే సభకు అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు, బహుజన సంఘాల నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు హరికృష్ణ, వెంకటేశ్వర్లు, యాదగిరి, సురేష్, నర్సింమారావు, నరేందర్, నాగేంద్రబాబు, ముకుందం, శోభన్, తదితర నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



పలిమెల: నిల్వ నీటిని పారబోయిస్తున్న అధికారులు



కాటారం: వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

పలిమెల: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ రమేశ్ కుమార్ గ్రామస్తులకు సూచించారు. మండంలోని అంబటిపల్లి, దమ్మూర్ గ్రామాల్లో డెంగీ జ్వరం పాజిటివ్ కేసులు నమోదైన కారణంగా మంగళవారం సబ్ యూనిట్ ఆఫీసర్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు దోమల నివారణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో ఉన్న డబ్బాలు, డ్రమ్ములు, తదితర వస్తువుల్లోని నిల్వ నీటిని తొలగించాలని సూచించారు. ప్రతి శుక్ర, మంగళవారాలు తప్పకుండా డ్రై డే పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో అంబటిపల్లి హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ సోనాజీ, సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ పుష్ప, లావణ్య, ఏఎన్ఎంలు శ్రీలత, సుజాత, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాటారం: పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో వ్యాధులు దరిచేరవని ఎంఎల్‌హెచ్‌పీ వైద్యురాలు డాక్టర్ వందన తెలిపారు. మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావుపూలే బాలుర గురుకుల పాఠశాలలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధులు, హ్యాండ్‌వాష్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరంలో హెల్త్ అసిస్టెంట్ సమ్మయ్య, ఏఎన్ఎం శ్యామల, ఆశ కార్యకర్త రాజేశ్వరి ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు అందజేస్తున్న తహసీల్దార్ శ్వేత

రేగొండ: మండలంలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన అల్లె స్వప్న ఇల్లు ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో బాధితురాలికి తహశీల్దార్ శ్వేత మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఆమె వెంట ఆర్ఐ జూపాక నరేష్, జూనియర్ అసిస్టెంట్ స్పందన ఉన్నారు.

ఆర్థిక సాయం

జయశంకర్ ఫౌండేషన్ రేగొండ మండల ఇన్‌చార్జ్ ఆకుల ప్రతాప్ అల్లె స్వప్న ఇల్లు కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేల ఆర్థిక సాయంతో పాటు, 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెన్నెపురెడ్డి అర్జున్, రాజు తదితరులు పాల్గొన్నారు.